





# DD9 వార్త

తెలుగు దినపత్రిక


బరిలోకి దిగితే రికార్డులు బద్దలే...
యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న రామ్ చరణ్



05

సంపుటి : 01 సంచిక : 195 | హైదరాబాద్, మార్చి, గురువారం 05, 2026 | పేజీలు : 05 వెల : 3.00

# రేషన్ కార్డుదారులకు తీపి కబురు..

మూడు నెలల రేషన్ ఏప్రిల్‌లోనే పంపిణీ..

తెలంగాణ లబ్ధిదారులకు ఒకేసారి 18 కిలోల చొప్పున సన్నబియ్యం..

సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్న ప్రభుత్వం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త అందించింది. రాబోయే వేసవి కాలంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని.. పేద ప్రజలు ప్రతి నెలా రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఏప్రిల్ నెలలోనే పంపిణీ చేయాలని కేంద్ర పౌర సరఫరాల శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మొదటి వారంలోనే భానుడి భగభగలు మొదలవ్వడం, రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో లబ్ధిదారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఈ ముందస్తు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణలో ఉన్న సుమారు ఒక కోటి మూడు లక్షల ఆహార భద్రత కార్డుదారులకు భారీ ఉపశమనం ..మిగతా 2లో

**మార్చి 8న అసెంబ్లీలో భారీ మార్పులు..!**

మార్చి 8న నూతన కౌన్సిల్ హాల్ ప్రారంభం
అసెంబ్లీ ప్రాంగణంలో
'తెలంగాణ తల్లి' విగ్రహ ఆవిష్కరణ
సీఎం, మండలి చైర్మన్
కొత్త ఛాంబర్లకు శ్రీకారం
ఒకే ప్రాంగణంలో బడ్జెట్
సమావేశాలు – పాలనలో సులభతరం

02

# టీచర్ల వేతనాలపై అపోహలొద్దు

ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు

విద్యాకమిషన్ నివేదికపై వివరణ

ప్రతిపక్ష విమర్శలపై ఆగ్రహం

దుష్ప్రచారం చేయొద్దని సూచనలు





**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో విద్యాకమిషన్ నివేదికపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు బుధవారం ప్రతిస్పందించారు. రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, విద్యాకమిషన్ రిపోర్టు తయారీకి ముందే వివిధ విద్యావేత్తల, సిబ్బంది, పరిశ్రమ నిపుణుల సలహాలను సేకరించారని, అందువల్ల ప్రతిపక్షాలు చేస్తున్న ..మిగతా 2లో

# ఇరాన్‌పై దాడులు ఆపండి


అగ్ర దేశాలకు చైనా హెచ్చరిక

సైనిక చర్యలు ఆపాలని డిమాండ్

నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌లో ప్రస్తావన

తమ అభిప్రాయాలు తెలిపిన చైనా ప్రతినిధులు

సైనిక శక్తితో సమస్యలు పరిష్కారం కావని వెల్లడి



**నేషనల్‌బ్యూరో, (డిడి9 వార్త):**
మధ్యప్రాచ్యంలో పరిస్థితులు రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ మరణించాడు. ఇరాన్ ప్రభుత్వం దీన్ని ధృవీకరించింది. దీంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయినా కూడా ఇరాన్‌పై సైనిక ఒత్తిడి కొనసాగుతుందనే వార్తలు వస్తున్నాయి. పలు వ్యూహాత్మక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ దాడులు ప్రాంతీయ భద్రతపై ప్రభావం చూపే అవకాశముందని ఆందోళనలు ..మిగతా 2లో

# పాలన గాడి తప్పింది

ఐఏఎస్, ఐపీఎస్‌లను సీఎం బెదిరిస్తున్నారు

రెండున్నరేండ్లలో ఐదుసార్లు బదిలీలు

మాటవినకపోతే ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు

ప్రజాసమస్యల పరిష్కారంలో తీవ్రమైన ఆలస్యం

కాంగ్రెస్ నేతల అవినీతి త్వరలో బయటపెడతా

మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో పరిపాలనా వ్యవస్థ సరిగా నడవడంలేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత టి. హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు పరిపాలన పట్టడంలేదని ఆరోపించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పదేపదే బదిలీ చేయడం వల్ల ప్రభుత్వ యంత్రాంగం స్థిరత్వం కోల్పోతుందని అన్నారు. రెండున్నరేళ్ల వ్యవధిలో ఐదు సార్లు భారీ ఎత్తున బదిలీలు చేపట్టారని, ఇది రాష్ట్ర చరిత్రలో అరుదైన విషయమని పేర్కొన్నారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని, ..మిగతా 2లో



# టీవీకేకు ఈ ఎన్నికలు ఎమోషన్

తంజావూరు సభలో విజయ్ భావోద్వేగం

పార్టీ మేనిఫెస్టో ఆవిష్కరించిన దళపతి

అన్ని పార్టీలను ఓడిస్తామని ధీమా

తనపై వస్తున్న ఆరోపణలపై కీలక వ్యాఖ్యలు

ప్రజలతో తన బంధాన్ని విడగొట్టలేరని వెల్లడి



**తంజావూరు, (డిడి9 వార్త):**
కొన్ని నెలల్లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ నటుడు విజయ్ సక్సెస్‌టీమ్ పార్టీతో (టీవీకే) బరిలో ఉంటుండటంతో రాజకీయ ..మిగతా 3లో

# 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి


కేంద్రానికి తెలంగాణ బీసీ కమిషన్ విజ్ఞప్తి

జనాభా గణనకు ముందే చేయాలన్న కమిషన్

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ

రిజర్వేషన్ల అంశం తేలేందుకు కీలకం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మరో 40 బీసీ కులాలను తక్షణమే కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. త్వరలో జరగబోయే జనాభా గణన ..మిగతా 2లో




# ఇది మనిషి సృష్టించిన విషాదం..

ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి

తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్

ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య



02

# సింగూరు ప్రాజెక్ట్ వేగవంతం చేయాలి

పనుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం

మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన సమీక్ష

హాజరైన రాజనర్సింహా, వివేక్, అధికారులు

డ్యామ్ భద్రతపై ప్రత్యేక దృష్టి

నష్టపోతున్న రైతులకు పరిహారం

## కాంట్రాక్టర్లకు మంత్రుల డెడ్‌లైన్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా సింగూరు ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ఆలస్యం కాకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ..మిగతా 2లో

# ఇరాన్‌పై దాడులు ఆపండి

మొదటిపేజీ తరువాయి

వ్యక్తమవుతున్నాయి.

ఈ పరిణామాలపై ప్రారంభంలో నిశ్శబ్దంగా ఉన్న చైనా, గత రెండు రోజులుగా తన స్పందనను మరింత స్పష్టంగా తెలియజేస్తోంది. బీజింగ్‌లో జరిగిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాల సందర్భంగా చైనా ప్రతినిధులు ఈ అంశంపై మాట్లాడారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం తగదని, సైనిక శక్తిని ఉపయోగించి సమస్యలను పరిష్కరించడం సరైన మార్గం కాదని చైనా స్పష్టం చేసింది. చైనా ప్రతినిధి లౌ క్విన్జియాన్ మాట్లాడుతూ, ఏ దేశానికీ ఇతర దేశాల విధిని నిర్ణయించే హక్కు లేదన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో అగ్రరాజ్యాల ఆధిపత్యం అనేది సమానత్వానికి విరుద్ధమని చెప్పారు. ఐక్యరాజ్యసమితి నియమాలు, అంతర్జాతీయ చట్టాలు గౌరవించబడాలని ఆయన పిలుపునిచ్చారు. సమస్యలు ఉన్నప్పటికీ వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవడం మాత్రమే సరైన మార్గమని అభిప్రాయపడ్డారు.

ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని, భౌగోళిక సమగ్రతను కాపాడుకోవడానికి హక్కు ఉందని చైనా పునరుద్ఘాటించింది. ఇరాన్‌పై జరుగుతున్న సైనిక చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే అవకాశముందని హెచ్చరించింది. అంతర్జాతీయ సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉద్రిక్తతలు తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరింది.ఇదే సమయంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కూడా వివిధ దేశాల నేతలతో సంప్రదింపులు జరిపారు. ఇరాన్, ఒమన్, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధ వాతావరణం మరింత విస్తరించకుండా తక్షణ చర్యలు అవసరమని చెప్పారు.

అమెరికా, ఇజ్రాయెల్ చర్యలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయని చైనా అభిప్రాయపడుతోంది. సైనిక బలాన్ని ఆధారంగా చేసుకుని ఇతర దేశాలపై ఒత్తిడి తేవడం అంతర్జాతీయ శాంతికి ముప్పు అని విమర్శించింది. ప్రపంచం "అడవి చట్టం" వైపు వెళ్లకూడదని హెచ్చరించింది. శక్తివంతమైన దేశాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించింది.ఇరాన్ అణు కార్యక్రమం అంశం కూడా ఈ ఉద్రిక్తతలకు ప్రధాన కారణంగా చెప్పబడుతోంది. ఇరాన్ అణు కార్యక్రమం శాంతి పరమైనదేనని టెహ్రాన్ పలుమార్లు పేర్కొంటోంది. అయితే అమెరికా, ఇజ్రాయెల్ ఈ అంశంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ అణు సమస్యను కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని చైనా స్పష్టం చేసింది. యుద్ధం ద్వారా సమస్యలు పరిష్కరించలేమని అభిప్రాయపడింది.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ద్వారా శాంతి చర్చలు జరగాలని చైనా సూచించింది. అవసరమైతే తాము నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ప్రాంతీయ దేశాలు కూడా సహకరించాలని కోరింది. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం తమ దేశ భద్రతను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. తమపై జరిగిన దాడులకు తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించింది. ప్రాంతీయ దేశాలు ఈ పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. గల్ఫ్ దేశాలు కూడా అప్రమత్తంగా ఉన్నాయి.

ప్రపంచ మార్కెట్లపై కూడా ఈ ఉద్రిక్తతల ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య మార్గాల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నెలకొంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం శాంతి చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపులు పెరుగుతున్నాయి. సైనిక చర్యలు మరింత విస్తరించకుండా అన్ని దేశాలు కట్టుబడి ఉండాలని కోరుతున్నారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడమే శాశ్వత పరిష్కారమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తంగా చూస్తే, ఇరాన్‌పై కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో అనిశ్చితి నెలకొంది. చైనా లాంటి ప్రధాన దేశాలు శాంతి కోసం పిలుపునిస్తుండగా, అమెరికాఇజ్రాయెల్ చర్యలు, ఇరాన్ ప్రతిస్పందన తదుపరి పరిణామాలను నిర్ణయించనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం అత్యవసరంగా కావలసింది ఉద్రిక్తతలను తగ్గించడం, సంభాషణకు మార్గం సుగమం చేయడం. యుద్ధం కాకుండా శాంతి వైపు అడుగులు పడితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధ్యమవుతుంది. ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తున్న ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో కీలక మలుపు తిరిగే అవకాశముంది.


# 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి

మొదటిపేజీ తరువాయి

కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. వచ్చే జనాభా గణనలో భాగంగా తెలంగాణలో ఇళ్ల జాబితా సేకరణ పనులు 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతాయి. ఆ తర్వాత అసలైన జనాభా లెక్కింపు 2027 ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుంది. ఈ లోపే కులాల మార్పులు జరగాలని కమిషన్ కోరుతోంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 130 కులాలను బీసీలుగా గుర్తించింది. వీరికి రాష్ట్రస్థాయిలో అన్ని పథకాలు అందుతున్నాయి. కానీ.. కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్న ఓబీసీ జాబితాలో మాత్రం మన రాష్ట్రం నుంచి కేవలం 90 కులాలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 40 కులాల పేర్లు కేంద్ర జాబితాలో లేవు. అందులో భాగంగానే బీసీ కమిషన్ ఈ సిఫారసులు చేసింది. జనాభా గణనలో ఈ 40 కులాల వారు బీసీలుగా నమోదు కాకపోతే.. రాష్ట్రంలో బీసీల సంఖ్య వాస్తవం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉంది. తద్వారా బీసీలకు అందాల్సిన నిధులు, ప్రయోజనాలు తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, బీసీ కమిషన్ పలుమార్లు కేంద్రానికి విన్నవించినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందుకే.. జనాభా గణన ప్రారంభం కాకముందే ఈ 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు లేఖ రాశారు. సాధారణంగా ఒక కులాన్ని కేంద్ర జాబితాలో చేర్చాలంటే రాష్ట్ర కమిషన్ సిఫార్సు మేరకు జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆమోదం తెలపాలి. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఆ కులాల విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీల్లో సీట్లు, రైల్వే, బ్యాంకింగ్ వంటి కేంద్ర ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభిస్తుంది. దీనిపై జాతీయ బీసీ కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.




# రేషన్ కార్డుదారులకు తీపి కబురు..

మొదటిపేజీ తరువాయి

కలగనుంది.

ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణలోనే కార్డులోని ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున అత్యంత నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇప్పుడు కేంద్రం సూచన మేరకు మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేస్తే.. ఒక్కో వ్యక్తికి ఏకంగా 18 కిలోల సన్నబియ్యం చేతికి అందుతాయి. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారికి సుమారు 72 కిలోల బియ్యం ఒకే దఫాలో లభిస్తాయి. దీనివల్ల వేసవి సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి లేదా ఎండల వల్ల బయటకు రాలేని వారికి ఆహార ధాన్యాల కొరత లేకుండా ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. అయితే ఈ భారీ మొత్తంలో బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అవసరమైన నిల్వలు, రవాణా సౌకర్యాలపై తెలంగాణ పౌర సరఫరాల శాఖ ప్రస్తుతం లోతుగా సమీక్షిస్తోంది.

గత ఏడాది వర్షాకాలంలో ఇలాగే మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇచ్చినప్పుడు రేషన్ డీలర్లు, లబ్ధిదారులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా రేషన్ దుకాణాల్లో మూడు నెలల స్టాక్‌ను భద్రపరచడానికి సరిపడా స్థలం లేకపోవడం డీలర్లకు పెద్ద సమస్యగా మారింది. మరోవైపు.. బయోమెట్రిక్ విధానంలో ఒకేసారి మూడు నెలల కోటా తీసుకోవాలంటే లబ్ధిదారులు ఈపోస్ యంత్రంపై మూడు సార్లు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. సర్వర్ సమస్యలు తలెత్తితే ఒక్కో కార్డు పూర్తి కావడానికి 15 నుండి 20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఇది దుకాణాల వద్ద రద్దీకి దారితీయవచ్చు. ఈ సాంకేతిక అడ్డంకులను అధిగమించేందుకు అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. రవాణా ఖర్చులు తగ్గడం, హమాలీలకు పని భారం తగ్గడం వంటి సానుకూల అంశాలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.



ఈ నిర్ణయం అమలులోకి వస్తే ఏప్రిల్ నెలలోనే పేద కుటుంబాల ఇళ్లలో బియ్యం నిల్వలు నిండుగా ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ సన్నబియ్యం పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో.. కేంద్రం ఇచ్చిన ఈ వెసులుబాటును వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక షెడ్యూల్, పంపిణీ తేదీలను ప్రభుత్వం ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# ఇది మనిషి సృష్టించిన విషాదం..

- **ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి**
- **తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్**
- **ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానిక దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి.

ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.


# పాలన గాడి తప్పింది

మొదటిపేజీ తరువాయి

కొత్తగా వచ్చిన అధికారులు పరిస్థితులను అర్థం చేసుకునేలోపే మరోసారి బదిలీ అవుతున్నారని విమర్శించారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని వ్యాఖ్యానించారు.

ప్రత్యేకంగా Greater Hyderabad Municipal Corporation (జీహెచ్ఎంసీ) కమిషనర్ల మార్పులపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నలుగురు కమిషనర్లు మారడం పరిపాలనా అస్థిరతకు నిదర్శనమని అన్నారు. ముఖ్యమైన నగర అభివృద్ధి పనులు నిరంతర పర్యవేక్షణ కోరుతాయని, కానీ తరచూ అధికారుల మార్పులతో ఆ పనులు ప్రభావితమవుతున్నాయని అభిప్రాయపడ్డారు.

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం బెదిరింపు ధోరణిలో మాట్లాడారని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం, మంత్రులకు నచ్చకపోతే అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని, కొందరికి పోస్టింగులు ఇచ్చినా జాయిన్ అయ్యే పరిస్థితి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఒత్తిడి తేవడం సరికాదని సూచించారు.



కాంగ్రెస్ నేతల అవినీతి, బినామీ వ్యవహారాలపై త్వరలోనే ఆధారాలతో బయటపెడతామని హరీశ్‌రావు హెచ్చరించారు. పరిపాలనలో పారదర్శకత లేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని స్థిరంగా ఉంచి ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మండలంలో వైసిపి 20 గ్రామ కమిటీల డిజిటలైజేషన్ పూర్తి.

- **మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి.**

**పెద్ద కడబూర్ మార్చి 4(డిడి9 వార్త):**



పెద్దకడబూరు మండలంలోని 20 పంచాయతీల గ్రామ కమిటీలు అనుబంధ విభాగాలను డిజిటలైజ్ చేసిన రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి , ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మంత్రాలయం నియోజకవర్గం శాసనసభ్యులు వైసీపీ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికు అందజేశారు, సుమారు 2200 మందిని కమిటీలో నియమించినట్లు వారు తెలిపారు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ఈ ప్రక్రియ చేపట్టినట్లు నాయకులు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో దొడ్డి మేకల సర్పంచ్ చంద్రశేఖర్ వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల వేతనాలపై అపోహలొద్దు

మొదటిపేజీ తరువాయి

ఆరోపణలు బద్ధకం అని చెప్పారు. వీరి ప్రకారం, "కమిషన్ నివేదికలో సూచించిన ప్రతీ అంశం కచ్చితమైన పరిశీలన తర్వాతే సూచించబడింది. ఇది ఒక చట్టబద్ధ, పరిశీలనాపూర్వక నివేదిక. అయితే, ప్రతిపక్షాలు చిన్న విషయాలను ఇలా చేయడం సరికాదని ప్రచారం చేస్తున్నారు" అని కే.కేశవరావు అన్నారు.



**విద్యాకమిషన్ సిఫార్సుల వివరాలు**

ఆకునూరి మురళి కమిషన్ నివేదికలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది వేతనాలను సమీక్షించింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలలో టీచర్లు, అసిస్టెంట్ టీచర్లు, మరియు ఇతర బోధనేతర సిబ్బందికి ప్రస్తుతం ఉన్న వేతనాలు ఇతర రాష్ట్రాల సామాన్య ప్రమాణాలతో పోలిస్తే కొంచెం ఎక్కువగా ఉన్నాయని కమిషన్ గుర్తించింది. దీంతో, భవిష్యత్తులో ఈ వేతనాలను హేతుబద్ధీకరించడం అవసరమని సూచించింది. ఇది వల్ల, ప్రతిపక్షాలు 'సమస్య ఎక్కువ' అని ప్రస్తావిస్తూ దార్శనిక విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. కానీ కే.కేశవరావు స్పష్టం చేసినట్టు, "కమిషన్ సిఫార్సులు సకాలంలో అమలు చేస్తూ, టీచర్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచేలా ప్రభుత్వం ముందడుగు వేస్తుంది. ఇది ప్రతిపక్షాల ప్రచారం కింద తప్పుగా అర్థం చేసుకోవద్దు" అని చెప్పారు.

**టీచర్ల సేవలను గుర్తించాలి**

జీతాల వివాదంపై ప్రత్యేకంగా కే.కేశవరావు "ప్రతిపక్షాలు జీతాల అంశాన్ని దుష్ప్రచారం చేస్తూ టీచర్ల ప్రతిష్టను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సమాజంలోని విద్యార్థుల భవిష్యత్తును దారితప్పకుండా చదువుతారు. వారి సేవలకు తగిన గౌరవం ఇవ్వాలి. ఈ సమాజంలో ఉపాధ్యాయులు మాత్రమే కాదు, ఇతర బోధనేతర సిబ్బందిని కూడా లెక్కపెట్టాలి" అని ఆయన అన్నారు. అంతేకాకుండా, కే.కేశవరావు విద్యాకమిషన్‌లో అసలు విద్యావేత్తలు లేరనే విమర్శలను కూడా ఖండించారు. "కమిషన్ నివేదిక రూపొందించేటప్పుడు అన్ని స్థాయి విద్యావేత్తల, విద్యా నిపుణుల సలహాలను తీసుకున్నాం. స్కూల్, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు బోధించిన అనుభవం ఉన్న వ్యక్తులు కమిషన్‌లో ఉన్నారు" అని చెప్పారు.

**ప్రతిపక్షాలకు సున్నితమైన సూచన**

కే.కేశవరావు ప్రభుత్వం ఈ నివేదికను అమలు చేస్తుందని, జీతాల విషయాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం వల్ల రాజకీయ వాయిద్యం రాదు అని స్పష్టం చేశారు. "ప్రతిపక్షాలు ప్రజలకు తప్పుదారిలో వివరాలను పంచకూడదు. విద్యావేత్తలు, ఉపాధ్యాయుల కృషికి తగిన గౌరవాన్ని చూపాలి. మేము సిఫార్సులను పరిశీలించి, సమయానికి అమలు చేస్తాం" అని చెప్పారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం ముందుకు సాగడానికి సిద్ధంగా ఉన్నదని, విద్యా కమిషన్ సూచనలు విద్యావేత్తల మరియు ఉపాధ్యాయుల మేలు కోసం మాత్రమే ఉన్నాయని కే.కేశవరావు పేర్కొన్నారు.

# మార్చి 8న అసెంబ్లీలో భారీ మార్పులు..!

- **మార్చి 8న నూతన కౌన్సిల్ హాల్ ప్రారంభం**
- **అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహ ఆవిష్కరణ**
- **సీఎం, మండలి చైర్మన్ కొత్త ఛాంబర్లకు శ్రీకారం**
- **ఒకే ప్రాంగణంలో బడ్జెట్ సమావేశాలు – పాలనలో సులభతరం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణం మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. అసెంబ్లీ ప్రాంగణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా మార్చి 8వ తేదీన నూతనంగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించనున్నారు. కౌన్సిల్ హాల్ ప్రారంభోత్సవం జరిగే అదే రోజున (మార్చి 8) అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని కూడా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర అస్తిత్వానికి, గౌరవానికి చిహ్నంగా ఈ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేస్తున్నారు.

నూతన కౌన్సిల్ హాల్‌తో పాటు, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి (CM) ఛాంబర్‌ను , శాసనమండలి చైర్మన్ ఛాంబర్‌ను కూడా ప్రభుత్వం అదే రోజున ప్రారంభించనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, ఈసారి జరగబోయే బడ్జెట్ సమావేశాలను ఒకే ప్రాంగణంలోని అసెంబ్లీ , నూతన కౌన్సిల్ హాల్‌లలో నిర్వహించనున్నారు. ఉభయ సభల సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరగడం వల్ల పాలనాపరమైన పనులు మరింత సులభతరం కానున్నాయి.



# టీవీకేకు ఈ ఎన్నికలు ఎమోషన్

**మొదటిపేజీ తరువాయి**



వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. తంజావూరు జిల్లాలో జరిగిన పెద్ద ర్యాలీలో తన పార్టీ మ్యానిఫెస్టోను విజయ్ ఆవిష్కరించారు.

ఈ ఎన్నికలు సాధారణంగా ఉంటాయని, కానీ తనకు మరియు తనను మద్దతు ఇచ్చే ప్రజలకు ప్రత్యేక భావోద్వేగమని ఆయన తెలిపారు. "తమిళనాడులో ఇతర పార్టీలకు సాధారణం, కానీ మా ప్రజలకు ఇవి ఒక వ్యక్తిగత, భావోద్వేగ అంశం. ఈసారి టీవీకే అన్ని పార్టీలను ఓడిస్తుందని నమ్మకం ఉంది. క్రికెట్‌లో సీఎస్కేకు ప్రజలు వేరిగా స్పందిస్తే.. ఎన్నికల్లో టీవీకే కూడా అదే ప్రభావం చూపిస్తుంది. ప్రజల మనసులోని అనుబంధాన్ని ఎవరు విడగొట్టలేరు" అని ఆయన ర్యాలీలో చెప్పారు.

విజయ్ ఎన్నికల హామీలలో ముఖ్యంగా రైతు బిడ్డల విద్య, మత్స్యకారుల సంక్షేమం, అవినీతి నినాదంపై దృష్టి పెట్టారు. "రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతు కుటుంబాల పిల్లల ఉన్నత విద్య ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ఆ కుటుంబాల్లో ఎవరికి ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదు. పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేని పేదలకు మద్దతు ఇవ్వడమే మా ఉద్దేశం. మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు తీసుకుంటాం. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

అలాగే, ఈ ఏడాది పొంగల్‌కి రిలీజ్ కావాల్సిన ఆయన చిత్రం 'జననాయగన్'ను న్యాయపరమైన సమస్యల కారణంగా వాయిదా పడిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. "చాలామంది మద్దతు ఇచ్చారు, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా వారిలో ఉన్నారు. ఆయనకు కృతజ్ఞతలు. అయినప్పటికీ, పరిస్థితిలో ఇంకా మార్పు కనిపించలేదు" అని విజయ్ వ్యాఖ్యానించారు. ఈ ర్యాలీతో టీవీకే పార్టీకి తమిళనాడులో రాజకీయ రంగంలో ప్రధాన హవా ఏర్పడినట్లు రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

# సింగూరు ప్రాజెక్ట్ వేగవంతం చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డ్యాం భద్రతపై ప్రత్యేక దృష్టి**

జాతీయ డ్యాం భద్రత సంస్థ సూచించిన నిబంధనల ప్రకారం సింగూరు డ్యాం పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకోసం నిపుణులతో ప్రత్యేక సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే జూలై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కాలువల లైనింగ్ పనులను జూన్ 26లోపు పూర్తి చేయాలని గడువు విధించారు. పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని హెచ్చరించారు.

**ఆందోల్ ప్రాంతానికి 40 వేల ఎకరాలకు నీరు**

ఆందోల్ నియోజకవర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళికకు సంబంధించిన సమగ్ర నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. ఉగాది పండుగకు ముందు శంకుస్థాపన చేయాలని అధికారులకు ఆదేశించారు.సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలని, సుందరీకరణ పనులు చేపట్టాలని మంత్రులు పేర్కొన్నారు.

**చెరువుల పునరుద్ధరణకు ఆదేశాలు**



ఆందోల్ ప్రాంతంలోని చిన్న చెరువుల పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. టెండర్లు పూర్తి చేసి ఈ సాగు సీజన్‌లోనే రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ములుగు జిల్లాలో ప్రాజెక్టులపై సమీక్ష**

ములుగు జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై కూడా మంత్రులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ములుగు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని నిర్ణయించారు. భూసేకరణకు సంబంధించిన అంచనాలు, ప్రతిపాదనలు 15 రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**రైతులకు మంచి పరిహారం**

భూసేకరణ పూర్తయ్యాక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నష్టపరిహారం చెల్లిస్తామని మంత్రులు తెలిపారు. భూములు కోల్పోయే రైతులకు అనుకూలమైన ప్యాకేజీ అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే తామే గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడతామని పేర్కొన్నారు.గత ప్రభుత్వం భూసేకరణ విషయంలో కఠినంగా వ్యవహరించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు.

**రామప్ప–లక్నవరం అనుసంధాన పనులు**

రామప్ప మరియు లక్నవరం మధ్య నీటి అనుసంధాన ప్రాజెక్టుకు అవసరమైన అదనపు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

**దేవాదుల, సమ్మక్క-సారాలమ్మ ప్రాజెక్టులు**

దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ అంశంపై మరోసారి 15 రోజుల్లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మక్కసారాలమ్మ ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, ముంపు బాధితులకు పరిహారం చెల్లించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

**కాంట్రాక్టర్లపై ఆగ్రహం**

పనుల్లో ఆలస్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


**రైతులకే ప్రాధాన్యం**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతులకు సమయానికి నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. ప్రతి ప్రాజెక్టుపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించి పురోగతిని పర్యవేక్షిస్తామని తెలిపారు.

# బాల్క సుమన్ ను కలిసిన గుడిహత్నూర్ నాయకులు

**డిడి9 వార్త గుడిహత్నూర్, మార్చి 04:**

ప్రియతమ నాయకుడు బాల్క సుమన్ బెయిల్‌పై విడుదలైన సందర్భంగా గుడిహత్నూర్ మండలానికి చెందిన పలువురు నాయకులు జైలు వద్ద కలుసుకుని సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాల్క సుమన్ గత కొద్ది రోజులుగా అనవసర ఆరోపణలతో జైలులో ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. అయితే న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, సత్యం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందని తెలిపారు.ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలని, రాజకీయ కుట్రలకు తావులేకుండా న్యాయపరంగా పోరాడతామని అన్నారు. బెయిల్ లభించడం న్యాయం విజయం సాధించినట్లేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో , పార్టీ కార్యకర్తలు సర్పంచ్ జాదవ్ జితేందర్ జాదవ్ విశాల్ రవి నాయక్ దోమకొండ సుధాకర్ ఎల్లపల్లి సదానంద్ పాల్గొన్నారు





# హైదరాబాద్ ఆర్బీఐ సహకారం సరస్వతి శిశు మందిర్‌లో ఆధునిక కంప్యూటర్ విద్యకు శ్రీకారం.

**బజార్హత్నూర్, మార్చి 4(డిడి9న్యూస్ ):-**

బజార్హత్నూర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్ బుధవారం నాడు హైదరాబాద్ ఆర్బీఐ సహాయంతో పగలు 12 గంటలకు ప్రారంభం చేశారు. దీంతో శిశుమందిరంలో కంప్యూటర్ విద్యకు శ్రీకారం చుట్టినట్లు అయినది.గత ఫిబ్రవరి 4వ తేదీ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారు పాఠశాలకు విరాళంగా ఇచ్చారని ఉపాధ్యాయులు చెప్పారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇచ్చోడ , ఎస్ బీ ఐ మేనేజర్ , నాగభూషణం,బజార్హత్నూర్,టిజిబి మేనేజర్,మహేష్లు హాజరై మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో ముందుకు రావాలంటే ఇలాంటి ఆధునికసదుపాయాలు ఎంతో అవసరమనితెలిపారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు నాగనాథ్,పాఠశాల సమితి అధ్యక్షులు చట్ల ఉత్తమ్, ఉపాధ్యక్షులు కొత్త శంకర్, కార్యదర్శి రాజన్న, బజార్ హత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎచ్ఎం జె.భూమన్న, ఉపాధ్యాయులు రమేష్, ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షులు వొర్ని సంతోష్,శిశు మందిర్ ప్రధానాచార్యులు వొర్ని వెంకటరమణ,ఆచార్యబృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధిహామీకూలీలకుఅలర్ట్..

## అమల్లోకి కొత్త రూల్. ఫాలో కాకుంటే డబ్బులు రావు.

బజార్హత్నూర్, మార్చి 4(డిడి 9న్యూస్ ): ఉపాధి హామీ కూలీలకు ముఖ్య గమనిక. ఉపాధి హామీ పథకంలో కొత్త నిబంధనఅమల్లోకి వచ్చింది. ఈ పథకంలో అక్రమాల జరగకుండా అడ్డుకు నేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల అమల్లోకితెచ్చింది. ఇకపై ఉపాధిహామీ కూలీలకు ముఖ హాజరు (ఫేషియల్అథెంటికేషన్) తప్పనిసరి చేసింది. మార్చి రెండో తేదీ నుంచి (సోమవారం) ఈ విధానం కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ నూతన విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో జాబ్ కార్డులో ఒకరి పేరు ఉంటే.. మరొకరు ఉపాధిహామీ పనులకు వెళ్లే పరిస్థితి ఉండేది. అలాగే మస్టర్‌లో దొంగ సంతకాలు చేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కేంద్రం ఈకేవైసీ విధానం తీసుకువచ్చింది. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఉపాధి హామీ కూలీకి ఈకేవైసీ తప్పనిసరి చేసింది. ఈ కేవైసీ పూర్తి అయితే అక్రమాలకు పూర్తిగా స్వస్తి పలకవచ్చనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఈ కేవైసీ తీసుకు వచ్చింది. 2025 అక్టోబర్ నెలలో ఉపాధి హామీకూలీలకు ఈకేవైసీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటి వరకు మెజారిటీ కూలీలకు ఈ ప్రక్రియను పూర్తిచేశారు. మరోవైపు కొత్త విధానం ప్రకారం ఉపాధి హామీ పనికి వెళ్లిన సమయంలో పనులు చేసే ప్రదేశంలో కూలీలకు ఒక ఐడీని క్రియేట్ చేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలు కూలీలకు మొదట ఫోటో తీస్తారు. పని పూర్తైన నాలుగు గంటల అనంతరం మరోసారి ఉపాధి హామీ కూలీల ఫోటోలు తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు సమాచారం అందుతుంది. వీటిలో ఏదీ మర్చిపోయినా ఉపాధి హామీ కూలీలకు బిల్లులుజమకావు. అయితే ఈవిధానం అమల్లో కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. మారుమూల గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నల్లు సరిగా లేనటువంటి పరిస్థితి. దీంతో ఫేసియల్ రికగ్నిష్‌న్ విధానం అనేది కష్టతరంగా మారింది. అయితే పని ప్రదేశంలోఉపాధి హామీ కూలీల ఫోటోలుతీయాలని.. ఆ తర్వాత సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లి యాప్‌లోఅప్లోడ్ చేయాలని అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత కోసమే కొత్తగా ముఖ హాజరు విధానం తెచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. ఈ విధానంతో ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందుతాయని..అలాగేఉపాధిహామీ పథకం సిబ్బందికి చాలా సమస్యలు తగ్గిపోతాయని చెప్తున్నారు.



# రైతుల కోసం ఉద్యమిద్దాం







- **10 లక్షల దరఖాస్తు సేకరణ**
- **ఉద్యమం విజయవంతం చెయ్యండి : ఎంపి జి నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ల పిలువు.**

**బజార్ హత్నూర్, మార్చి 4(డిడి9వార్త ):-**

తెలంగాణ రాష్ట్రంలో ఫసలు బీమా యోజన వెంటనే అమలు చేయుటకు రైతుల పక్షాన ఉద్యమించడానికి కార్యకర్తలు నడుంబిగించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్అన్నారు.బుధవారం రోజు ఆదిలాబాద్ లో స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్తో కలిసి క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని బిజెపి మండలాల అధ్యక్షులు, జిల్లాలోని బిజెపి కార్యకర్తలు నాయకులతో సమావేశమై పలు అంశాలు చర్చించారు.రైతుల నుంచి దరఖాస్తులు సేకరించి ప్రభుత్వానికి ఫసల్ భీమా యోజన ఎంత ముఖ్యమో తెలిసేలా చేద్దామని ఆయన అన్నారు.ఈ సమావేశంలో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్,సీనియర్ నాయకులు అరిగేల నాగేశ్వర్రావు,బీజేపీ నేతలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ బొజ్జ భూమా గౌడ్ వర్ధంతి...

**నిజామాబాద్ కోటగిరి /పోతంగల్ మార్చ్ 4 (డిడి9 వార్త )**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో పేద ప్రజల పక్షాన పోరాడి న నాయకులు కామ్రేడ్ బొజ్జ భూమగౌడ్ 5 వర్ధంతిని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిపిఐ మండల కార్యదర్శి ఏ విట్టల్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం కల్లుగీత కార్మికుల కోసం నిరంతరం పోరాడిన మహానీయుడు కామ్రేడ్ బొజ్జ భూమా గౌడ్ వర్ని మండలం ముశ్రా గ్రామస్తులైన భూమా గౌడ్ చుట్టుపక్కల గ్రామాలలో పేదలకు భూముల కోసం ఇళ్లస్థలాల కోసం నిరంతరం కృషి చేశారు చింతకుంట కోపూరు తిమ్మాపూర్ మూస్రా గ్రామాలలో నిరుపేదలకు సాగు భూములు ఇళ్ల పట్టాలు ఇప్పిచ్చిన మహా నాయకుడని అన్నారు వర్ని మండల సిపిఐ కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్ర గీతా పనివార సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు టి ఎఫ్ టి లైసెన్సులు కోసం గీత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన మహానీయుడు భూమా గౌడ్ గారు ఆయన ఆసన సాధనకై కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్లగంగాధర్ రాజు గుడాల రాములు గణేష్ సాకలి రాజు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



# పారదర్శకతకు నిలయం.. గ్రామసభ





- **బషీరాబాద్‌లో నిధులపై చర్చ..**
- **పన్ను చెల్లింపుదారులకు బహుమతుల అందజేత**

**నిజామాబాద్ జిల్లా 04 మార్చి(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ జమున మహేష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రణాళికలపై గ్రామస్తులతో కలిసి చర్చించారు. పంచాయతీకి అందిన నిధులు మరియు వివిధ పనులకు చేసిన ఖర్చుల వివరాలను అధికారులు సభలో చదివి వినిపించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే బషీరాబాద్‌ను ఆదర్శ గ్రామం చేయవచ్చని సర్పంచ్ పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహకం గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు మరియు ప్రజలను పన్నుల చెల్లింపులో ప్రోత్సహించేందుకు టాక్స్ కట్టు గిఫ్ట్ పట్టు పేరుతో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. సకాలంలో ఇంటి పన్ను చెల్లించిన గృహ యజమానుల పేర్లతో లక్కీ డ్రా నిర్వహించి, విజేతలకు సర్పంచ్, ఎంఆర్వో బహుమతులు అందజేశారు. పన్నులు సకాలంలో చెల్లిస్తేనే గ్రామంలో మరిన్ని మౌలిక వసతులు కల్పించడం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి అందజేత గ్రామసభ అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన ఇద్దరు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను సర్పంచ్, ఎంఆర్వో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో, ఆర్.ఐ, ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కందకుర్తి పుష్కర ఘాట్లను పరిశీలించిన సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా 04 మార్చి(డీడీ9 వార్త) :**

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. బుధవారం రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందకుర్తి వద్ద గల గోదావరి పుష్కర ఘాట్లను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఘాట్ల వద్ద ఏర్పాట్లు, మహిళల కోసం ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్ల వద్దకు వచ్చే దారులు, వెళ్లే మార్గాలను క్రమబద్ధీకరించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా విశాలమైన పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. నదిలో స్నానాలకు వచ్చే భక్తులు ప్రమాదాల బారిన పడకుండా, ప్రాణనష్టం జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత పుష్కరాల సమయంలో ఎదురైన లోటుపాట్లు, సమస్యల గురించి సీపీ స్థానిక గ్రామస్తులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అవరోధాలు కలగకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్సై కె. చంద్రమోహన్, కందకుర్తి ఉపసర్పంచ్ నాగేష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



## హున్సాలో ఘనంగా పిడిగుద్దులాట

- **గాయాలైనా వెనకడుగు వేయని గ్రామస్తులు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా04 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండలం హున్సా గ్రామంలో వందేళ్ల నాటి సంప్రదాయం పునరావృతమైంది. హోలీ పండుగను పురస్కరించుకుని ఏటా నిర్వహించే పిడిగుద్దులాట ఈసారి కూడా ఉత్సాహంగా సాగింది. బుధవారం ఉదయం నుంచే గ్రామస్తులు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాల్లో మునిగితేలారు. సాయంత్రం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు పిడిగుద్దులాటకు సిద్ధమయ్యారు. గ్రామ పెద్దల పర్యవేక్షణలో కర్ర స్తంభాలు పాతి, తాడును గట్టిగా బిగించారు. ఆట నిబంధనల ప్రకారం గ్రామస్తులు ఒక చేతితో తాడును పట్టుకుని, మరో చేతి పిడికిలితో ప్రత్యర్థులపై గుద్దులు కురిపించారు. ఈ క్రమంలో దెబ్బలు తగిలి రక్తాలు కారినా గ్రామస్తులు ఏమాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. కామదహనంలోని బూడిదను గాయాలపై రాసుకుంటే నొప్పులు తెలియవని, త్వరగా మానిపోతాయని వారి ప్రగాఢ విశ్వాసం. సుమారు పది నిమిషాల పాటు సాగిన ఈ రసవత్తర పోరాటాన్ని గ్రామ పెద్దలు తాడు వదిలివేయడంతో ముగించారు. ఆట ముగిసిన వెంటనే ఇరువర్గాల వారు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకోవడం విశేషం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



## కుమ్మన్‌పల్లిలో రంగేళి.. ఉత్సాహంగా హోలీ సంబరాలు

- **గ్రామస్తుల మధ్య వెల్లివిరిసిన సోదరభావం..**
- **రంగులమయమైన పల్లె**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో బుధవారం హోలీ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సంబరాల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా గ్రామస్తులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వసంత రుతువు ఆగమనానికి ప్రతీకగా నిర్వహించే ఈ పండుగను పురస్కరించుకొని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామ పెద్దలు, సర్పంచ్ సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగను జరుపుకున్నారు. రంగుల కేళిలో మునిగితేలుతూ, ఆత్మీయ ఆలింగనాలతో సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పాత పగలను వీడి అందరూ ఒక్కటిగా ఉండాలనే సందేశంతో ఈ వేడుకలు సాగాయి. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ, ప్రతి ఏటా ఇలాగే ఐక్యమత్యంతో పండుగలు జరుపుకోవాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజ్ పటేల్, సర్పంచ్ శీలం మహేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షులు తోకల అంజయ్య, ప్రముఖులు రాహుల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నేడు జిల్లా కలెక్టర్తో సమావేశం

- **జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో హాజరుకావాలి.**

**బజార్ హత్నూర్, మార్చి 4(డిడి 9న్యూస్ ):-**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల) కార్యక్రమంలో భాగంగా తేది 5 గురువారం రోజున ఉ.9.30 ని.లకు జిల్లా లోని ఎంపీడీఓలు,ఎంపీఎస్లు , ఏపీఓలు, ఏపీఎంలు ఆదిలాబాద్ జిల్లా కలెక్టరుతో సమావేశము ఉంటుందని డిఆర్డిఓ, డిఆర్డిఏ ఆదిలాబాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారని బజార్ హత్నూర్ తహసీల్దార్ శ్యామ్ సుందర్ బుధవారం చెప్పారు.కనుక సదరు అధికారులు/సిబ్బంది జిల్లా పరిషత్తు సమావేశ మందిరములో హాజరు కావలసిందిగాకోరారు.అదేవిదంఎంపీడీఓలు ,తహసీల్దార్లు తేది 5 నాడు పగలు 3.00 గం.లకు ఆయామండలంలోని సర్పంచులు,ఏపీఓలు,ఏపీఎంలు ,ఇ.సి.లు, టి.ఏ.లు,పంచాయితీ సెక్రటరీలు&అన్ని లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకొని తగు సూచనలు చేయగలరని పేర్కొన్నారు.

## భూములకు దారి మూసివేత...రైతుల ఆవేదన

**బోధన్, నిజామాబాద్ జిల్లా04 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర శివారు ప్రాంతంలోని సర్వే నెంబర్లు 22/50, 22/43, 22/28 లో సుమారు 10-15 సర్వే నెంబర్లకు చెందిన వ్యవసాయ భూములకు వెళ్లే మార్గాన్ని కంచె వేసి గేటు ఏర్పాటు చేసి మూసివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్రో సిటీ పేరిట జాకీర్ అనే వ్యక్తి ఈ చర్యకు పాల్పడినట్లు వారు ఆరోపించారు. రైతుల వివరాల ప్రకారం... ప్రస్తుతం పంటలు కోత దశలో ఉండగా దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుమార్లు వినతి చేసినప్పటికీ స్పందించలేదని, భూములకు ఎలాంటి దారి లేదని చెప్పి తిరస్కరించాడని తెలిపారు. గతంలో ఎద్దుల బండ్లు సైతం సులభంగా రాకపోకలు సాగించిన మార్గం ఇప్పుడు కంచెలు, పైపులతో మూసివేయబడిందని చెప్పారు. దీంతో మనుషుల రాకపోకలకూ అవరోధం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బుధవారం రైతులు సాలూర ఇంచార్జి తహసీల్దార్ అనూషకు మెమోరాండం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. స్థలాన్ని పరిశీలించి పాత మార్గాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అల్లే జనార్ధన్, ఘంటే వీరేష్, మైదపు సంజు, సురేష్ పటేల్, జయరాం, హన్మంతు, అల్లే రమేష్, శ్రీకాంత్, సోక్కం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




## కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.... పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు పెన్నుల పంపిణీ

**నిజామాబాద్ కోటగిరి/ పొతంగల్ ఫిబ్రవరి మార్చి 4 (డిడి9 వార్త)**

నిజామాబాద్ కోటగిరి మండలంలోని గవర్నమెంట్ హై స్కూల్ లలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు పెన్నులు పంపిణీ చేసినట్లు బిజెపి మండల అధ్యక్షుడు వేముల నవీన్ తెలిపారు. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ స్కూల్ లలో పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు వారు పరీక్షలు మరింత ఉత్తేజంతో రాసేందుకు తమ వంతు సహకారంగా కోనేరు శశాంక్ మండలంలోని ఎత్తుండా కోటగిరి, కస్తూర్బా, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లలోని విద్యార్థులకు 256 మందికి ఎగ్జామ్ ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ఏముల నవీన్ మండల సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు , కోనేరు సాయి తరుణ్ తేజ, కులకర్ణి శ్యామల మండల సీనియర్ నాయకులు శ్యామ్, నాగేల్లి శ్రీనివాస్, మామిడి సాయిలు ,విలాస్,గుంజరి జగదీష్,నగేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కుమ్మన్‌పల్లిలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04 మార్చి(డీడీ9 వార్త) :**

హోలీ పండుగ సంబరాల్లో భాగంగా సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు గ్రామస్థులను ఉర్రూతలూగించాయి. తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పోటీల కోసం కేవలం స్థానికులే కాకుండా సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి పేరుగాంచిన మల్లయోధులు తరలివచ్చారు.బరిలోకి దిగిన యోధులు ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు వేసిన ఎత్తులు, పైఎత్తులు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అంతరాష్ట్ర మల్లయోధుల మధ్య జరిగిన పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన మల్లయోధులకు గ్రామ పెద్దలు నగదు పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శీలం మహేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు రాజ్ పటేల్ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రతి ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు తోకల అంజయ్య, రాహుల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మికతకు నిలయం.. రంజాన్ మాసం

- **బోధన్ ఇఫ్తార్ విందులో సీపీ సాయి చైతన్య**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 04 మార్చి(డీడీ9 వార్త) :**

రంజాన్ మాసం కేవలం ఉపవాసాలకే పరిమితం కాదని, మనసును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ జామ మసీదు కమిటీ అధ్యక్షుడు మహబూబ్ గుల్షానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముక్తి జావేద్ నిర్వహించిన ప్రత్యేక దువాలో పాల్గొన్న సీపీ, అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఉపవాసాలు మనిషిలో నియమం, సహనం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. పేదల పట్ల కరుణాభావం, దానధర్మాలు, సోదరభావం వంటి విలువలు ఈ మాసంలో ప్రతి ఒక్కరిలో వెల్లివిరుస్తాయని తెలిపారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో మెలిగి బోధన్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వెంకటనారాయణ, విజయబాబు, కృష్ణ, ఎస్సై హబీబ్, మసీద్ కమిటీ సభ్యులు సయ్యద్ జాకీర్, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ పిలుపు మేరకు ఇఫ్తార్ విందుకు విచ్చేసిన సీపీకి కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# మనుషుల కంటే అడవే నయం..



సినిమా షూటింగ్‌లు, గ్లామర్ మెరుపులు, వందల మంది మనుషుల మధ్య బిజీగా గడిపే నటి మాళవిక మోహనన్ లో ఒక అద్భుతమైన వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ దాగి ఉన్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె జంతువుల పట్ల తనకున్న ప్రేమను పంచుకున్నారు. జపాన్‌కు చెందిన 'పంచ్' అనే బేబీ కోతిని దాని తల్లి వదిలేసిన ఉదంతం తనను ఎంతగానో కదిలించిందని ఆమె పేర్కొన్నారు. వన్యప్రాణుల ఫోటోగ్రఫీ అంటే కేవలం కెమెరా పట్టుకుని వెళ్లడం కాదు, అది ఒక తపస్సు అని మాళవిక అన్నారు. "అడవిలోకి వెళ్లినప్పుడు మనం అక్కడ అతిథులం మాత్రమే, ఆక్రమణదారులం కాదు. జంతువుల దగ్గరకు వెళ్లేటప్పుడు మనకు ఏదో హక్కు ఉన్నట్లు ప్రవర్తించకూడదు. వాటిని గౌరవించాలి. అడవి మనకు నేర్పే అతిపెద్ద పాఠం ఓపిక . ఒక్కోసారి 12 గంటలు వేచి చూసినా ఏ జంతువు కనిపించకపోవచ్చు, అంతా మన అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది" అని ఆమె వివరించారు. 2019లో సరదాగా మొదలైన ఈ ఫోటోగ్రఫీ ప్రయాణం ఇప్పుడు ఆమెకు ఒక ప్యాషన్‌గా మారిందట. "సినిమా సెట్స్‌లో సగటున 300 నుండి 400 మంది మధ్య ఉంటాను. ఆ హడావిడి నుండి విరామం దొరికినప్పుడు అడవిలోకి వెళ్లడం నాకు ఒక ధ్యానం లాంటిది. అక్కడ మనుషులు ఉండరు, కేవలం నిశ్శబ్దం, ప్రశాంతత మాత్రమే ఉంటాయి. మనుషుల కంటే అడవే నయం అనిపిస్తుంది " అని మాళవిక తన మనసులోని మాటను పంచుకున్నారు. గత ఆగస్టులో ఆఫ్రికాలోని సెరెంగేటి నేషనల్ పార్క్‌లో జరిగిన 'గ్రేట్ మైగ్రేషన్' (జంతువుల వలస)ను చూడటం తన జీవితంలో ఒక మధుర జ్ఞాపకమని ఆమె చెప్పారు. అలాగే ఒక తల్లి చిరుత పులి తన పిల్లలతో కలిసి ఉన్న దృశ్యాన్ని కెమెరాలో బంధించడం తనను ఎంతో ప్రభావితం చేసిందని అన్నారు. రాజస్థాన్‌లోని రణతంబోర్, మహారాష్ట్రలోని తడోబా అడవుల్లో కూడా ఆమె పర్యటించారు. ముంబై వంటి రద్దీ నగరాల్లో నివసించే వారికి ప్రకృతితో సంబంధం ఉండటం చాలా అవసరమని మాళవిక అభిప్రాయపడ్డారు. ఇది మన మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రకృతితో మమేకమైనప్పుడే మన జీవితంలో ఒక సమతుల్యత వస్తుందని చెప్పుకొచ్చారు.

# బరిలోకి దిగితే రికార్డులు బద్దలే... యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న రామ్ చరణ్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'. అనౌన్స్‌మెంట్ నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు ఉండగా, తాజాగా ఈ మూవీ నుంచి విడుదలవుతున్న పాటలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామా కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన మొదటి పాట 'చికిరి చికిరి' చార్ట్‌బస్టర్‌గా నిలిచి, యూట్యూబ్‌లో దుమ్మురేపింది. తాజాగా విడుదలైన రెండో పాట 'రై రై రారా' అంతకు మించి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాట విడుదలైన కొద్ది గంటల్లోనే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

తాజా సమాచారం ప్రకారం, ఈ సాంగ్ ఇప్పటికే 31 మిలియన్లకు పైగా వ్యూస్, 5 లక్షలకు పైగా వ్యూస్ (రియల్ టైమ్) మరియు 30 వేల లైక్స్‌ను సొంతం చేసుకుని ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఒక పవర్‌ఫుల్ పోస్టర్ ద్వారా అధికారికంగా వెల్లడించింది. రామ్ చరణ్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా, బుచ్చిబాబు సనా ఎంతో పకడ్బందీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు టాక్. ఈ పాటల్లోని బీట్, చరణ్ స్టెప్పులు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. 'పెద్ది' లో చరణ్ ఒక విభిన్నమైన లుక్‌లో కనిపించబోతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. అలాగే శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక పాటలే ఈ స్థాయిలో రికార్డులు సృష్టిస్తుంటే, సినిమా విడుదలైతే బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట ఎలా ఉంటుందోనని మెగా అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# 'టాక్సిక్' సినిమా విడుదల వాయిదా..




కన్నడ స్టార్ హీరో యష్ అభిమానులకు ఇది కాస్త నిరాశ కలిగించే వార్తే అని చెప్పాలి. 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దాదాపు నాలుగేళ్ల గ్యాప్ తీసుకుని యష్ నటిస్తున్న భారీ చిత్రం 'టాక్సిక్' విడుదల వాయిదా పడింది. అసలు ప్లాన్ ప్రకారం, ఈ సినిమాను మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ భావించారు. కానీ ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో ఇజ్రాయెల్, అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఈ సినిమాను జూన్ నెలకు వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించి సినీ ప్రియులకు షాకిచ్చారు. ''టాక్సిక్ సినిమాను కేవలం మన దేశంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్ కోసం కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించాం.

ఎన్నో ఏళ్ల కష్టాన్ని మార్చి 19న మీకు చూపించాలనుకున్నాం. కానీ ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధం వల్ల మా గ్లోబల్ రిలీజ్ ప్లాన్స్‌కు ఇబ్బంది కలిగేలా ఉంది. అందుకే మా భాగస్వాములు, ప్రేక్షకుల శ్రేయస్సు కోరి ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నాం. జూన్ నాటికి పరిస్థితులు సాధారణ స్థితికి వస్తాయని ఆశిస్తున్నాం. మీ అవగాహన, సహనానికి మేము మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. మీ నిరంతర, ప్రేమ, మద్దతు కోసం ఎదురుచూస్తున్నాము. 'టాక్సిక్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమాల్లో ఇంగ్లీష్, భారతీయ భాషల్లో జూన్ 4 2026న విడుదల కానుంది. సినిమాల్లో కలుద్దాం'' అని చిత్ర యూనిట్ ఒక ప్రకటనలో పేర్కొంది.

కాగా.. యశ్ ఈ సినిమాకు యాక్టర్‌గానే కాకుండా కోప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా కావడంతో, విదేశాల్లో పరిస్థితులు బాగోలేనప్పుడు రిస్క్ తీసుకోవడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్' తర్వాత యశ్ నుండి వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యష్‌తో పాటు కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు.

# నన్ను తక్కువ అంచనా వేయకండి..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస పెట్టి భారీ ప్రాజెక్టులతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న చిత్రాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న అతిపెద్ద సినిమా 'కల్కి 2898 AD' కి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2'. దర్శకుడు నాగ్ అశ్విన్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట సాగించింది. ఇప్పుడు అంతకు మించి ఉండేలా సీక్వెల్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో నటించిన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని, రెండో భాగంలో తన పాత్ర గురించి కొన్ని కీలక విషయాలను పంచుకున్నారు.మొదటి భాగంలో కేవలం ఒక పాట, కొన్ని సీన్లకే పరిమితమైన దిశా, సీక్వెల్‌లో మాత్రం ఫుల్ లెంగ్త్ రోల్‌లో కనిపించబోతున్నట్లు స్పష్టం చేశారు. ''మొదటి భాగంలో నా పాత్ర చాలా చిన్నది, కేవలం ఒక సాంగ్‌కే పరిమితమయ్యాను. కానీ 'కల్కి 2'లో నా స్క్రీన్ టైమ్ చాలా ఎక్కువగా ఉంటుంది. నా పాత్రను తక్కువ అంచనా వేయకండి.. మీరు ఊహించని విధంగా ఉండబోతోంది. ముఖ్యంగా అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజ నటులతో కలిసి నటించే టాకీ పార్ట్ (డైలాగ్ సీన్లు) ఈసారి ఎక్కువగా ఉన్నాయి. త్వరలోనే నేను షూటింగ్‌లో పాల్గొనబోతున్నాను. ఈ సినిమా కోసం నేను కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను'' అని ఆమె పేర్కొన్నారు.మొదటి భాగంలో ప్రభాస్ సరసన కాసేపు మెరిసిన దిశా, రెండో భాగంలో కథలో కీలకం కాబోతుండటం ఫ్యాన్స్‌లో ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా, కమల్ హాసన్ సుప్రీం యాస్కిన్‌గా తమ విశ్వరూపాన్ని చూపించబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. నాగ్ అశ్విన్ ఈసారి హాలీవుడ్ రేంజ్ విజువల్స్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరచడానికి సిద్ధమవుతున్నారు. ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రం 'కల్కి 2' ఎప్పుడెప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# అందుకే.. ఒక్కోసారి టీచర్‌లా ప్రవర్తించా



శివాజీ, లయ మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. వారిద్దరూ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకుడు. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా రూపొందిన ఈ సినిమా థియేటర్లలో ఈనెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో శివాజీ మాట్లాడుతూ మన దేశంలో వినోదం అనగానే సినిమానే గుర్తుకొస్తుందన్నారు. "ఈటీవీ విన్ నుంచి సినిమా వస్తుందంటే ఆడియన్స్‌లో ఆసక్తి రెట్టింపు అవుతుంది. వారికి మరింత వినోదం ఇవ్వడం కోసం ఈటీవీ విన్ ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.499కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్, ఎంపిక చేసిన మల్టీప్లెక్స్‌ల్లో రూ.799కే నాలుగు టికెట్స్‌తోపాటు లార్జ్ పాప్‌కార్న్ అందించాలని నిర్ణయించుకుంది. సినిమా అందరికీ చేరువకావాలనే ఈ ఆఫర్‌ను 'ఈటీవీ విన్' బిజినెస్ హెడ్ సాయికృష్ణ ప్రకటించారు. సినిమా థియేటర్‌లలో పాప్‌కార్న్ అనేది చాలా పెద్ద ఇష్యూ.. దాన్ని ఈటీవీ విన్ సెట్ చేసేసింది". "ఈ సినిమా కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది. కుటుంబసమేతంగా చూసి ఎంజాయ్ చేసే చిత్రమిది. నేను ఈ సినిమాకు ఖర్చు పెట్టాల్సింది అంతా కూడా స్క్రీన్ మీదే పెట్టాను. ఒక్కోసారి టీచర్‌లా ప్రవర్తించాను. అలా ఉండడానికి కారణం.. ఒక గొప్ప సంస్థ నన్ను నమ్మి నాకు ఓ బాధ్యత ఇచ్చినప్పుడు వాళ్లకు మంచి అవుట్‌పుట్ ఇవ్వాలి. అందుకే ఈ సినిమాకు మరింత కష్టపడి వర్క్ చేశాను. వాళ్లకు మాట ఇచ్చినట్లు మంచి చిత్రం తీశాను. ఈ ఆఫర్‌ను మాత్రం అందరూ గుర్తుపెట్టుకోండి" అని అన్నారు.

# వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో.. ఎన్‌బీకే 112!



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ఈ వారమే గోపీచంద్ మలినేని సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇది ఈ ఏడాది చివర్లోనే తెరపైకి వచ్చే అవకాశముంది. అయితే ఈ లోగానే ఆయన తదుపరి సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకొచ్చింది. దర్శకుడు వివేక్ ఆత్రేయ చెప్పిన కథకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం.

'సరిపోదా శనివారం' విజయం తర్వాత వివేక్ పట్టాలెక్కించనున్న చిత్రమిదే. ఇది ఎక్కువ విస్తృతి ఉన్న కథతో ముస్తాబు కానుందని.. బాలయ్య దీంట్లో చాలా కొత్తగా కనిపిస్తారని.. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిసింది. ఇది 'ఎన్‌బీకే 112' ప్రాజెక్ట్‌గా ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది.

# సూర్య 'కరుప్పు' రిలీజ్ డేట్ ఫిక్స్?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. వరుసగా చేసిన ప్రయోగాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు దర్శకుడు ఆర్ జే బాలాజీ దర్శకత్వంలో చేస్తున్న పక్కా మాస్ యాక్షన్ డ్రామా 'కరుప్పు' పైనే సూర్య ఫ్యాన్స్ ఆశలన్నీ పెట్టుకున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌కు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.

ముందుగా 'కరుప్పు' చిత్రాన్ని ఏప్రిల్ 10న విడుదల చేయాలని మేకర్స్ భావించినట్లు సమాచారం. అయితే, తాజా పరిణామాల ప్రకారం యష్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమా వాయిదా పడనుందనే వార్తలు వస్తుండటంతో, సూర్య సినిమాను మార్చి 19 లేదా 20 తేదీల్లోనే థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా లెవల్‌లో భారీ క్రేజ్ ఉన్న సూర్యకు ఈ సమ్మర్ సీజన్ 'టాక్సిక్' వదిలిన ఖాళీ విండో బాగా కలిసి వచ్చే అవకాశం ఉంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఒకేసారి ఈ మాస్ బొమ్మను విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆర్ జే బాలాజీ తన స్టైల్ కామెడీని పక్కన పెట్టి, సూర్యను ఒక పవర్‌ఫుల్ రోల్‌లో చూపిస్తున్న ఈ సినిమాపై కోలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం రిలీజ్ డేట్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.